

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



స్టాక్ మార్కెట్లకు ఐటీ బూస్ట్.. లాభాల్లో ముగిసిన సూచీలు

సంపుటి:-01, సంచిక:-140, శనివారం 17-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్



సీఎం రేవంత్ ఆదేశాల అమలు..

విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

- యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్
- విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు
- విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
- విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక

2లో

ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!

- బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ
- నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు
- ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక



తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, - మిగతా 2 లో

సింగరేణి ప్రైవేటీకరణపై
మంత్రి కీలక ప్రకటన



- సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ
- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని - మిగతా 2 లో

గడ్డంతో న్యూ లుక్
అసలు కారణం చెప్పిన కేటీఆర్

- కొత్త గడ్డం లుక్‌తో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచిన కేటీఆర్
- రామగుండం పర్యటన నేపథ్యంలోనే ఈ మార్పు అని వెల్లడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కేటీఆర్ ఫొటోలు, వీడియోలు
- కేటీఆర్ లుక్‌ను 'మాస్' అంటూ ప్రశంసిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు
- 'ఆ మాత్రం ఉండాలి' అంటూ గడ్డంపై కేటీఆర్ సరదా వ్యాఖ్య



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తన సరికొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎప్పుడూ క్లీన్ షేవ్‌తో కనిపించే ఆయన, ఈసారి గడ్డంతో దర్శనమివ్వడం రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, - మిగతా 2 లో

నౌకలోని 21 మంది సిబ్బంది సురక్షితంగా గట్టెక్కారు



- హర్మూజ్ జలసంధిలో నౌక మునక.. సముద్రంలో తేలియాడుతున్న ఐఫోన్లు, పెర్ఫ్యూమ్‌లు
- హర్మూజ్ జలసంధిలో మునిగిపోయిన యూఏఈ కార్గో నౌక
- సముద్రంలో తేలియాడుతున్న ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్‌లు
- మైన్ వల్లే ప్రమాదం అన్న ఇరాన్, దాడి జరిగిందన్న అధికారులు
- ప్రాంతంలో పెరుగుతున్న వాణిజ్య నౌకలపై దాడుల ఘటనలు

హర్మూజ్ జలసంధిలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల మధ్య యూఏఈకి చెందిన ఒక భారీ - మిగతా 2 లో

పాకిస్థాన్‌లో తీవ్ర విషాదం.. స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి



- పెషావర్‌లో కూలిన స్కూల్ పైకప్పు
- ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక టీచర్ మృతి
- 40 మందికి పైగా విద్యార్థులకు తీవ్ర గాయాలు
- పాఠశాల యజమానిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై దర్యాప్తునకు ఆదేశించిన అధికారులు - మిగతా 2 లో

అలాంటి వాళ్లను కాల్చి చంపాలి
ట్రంప్ సంచలన వ్యాఖ్యలు


- సైనిక రహస్యాలు లీక్ చేసేవారిని కాల్చి చంపాలన్న ట్రంప్
- ఇరాన్‌పై దాడి వివరాలు మీడియాకు లీకయ్యాయని ఆరోపణ
- లీకేజీతో సైనిక చర్య సమయం మార్చినట్లు వెల్లడి
- రెండు రోజుల తర్వాత దాడి నిర్వహించినట్లు ట్రంప్ ప్రకటన
- లీకేజీకి పాల్పడిన వ్యక్తి వివరాలు వెల్లడించని అధ్యక్షుడు



2లో


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సైనిక రహస్యాలను బయటపెట్టే వారిని కాల్చి చంపాలని అన్నారు. ఇరాన్‌పై దాడికి సంబంధించిన కీలక సమాచారం మీడియాకు లీక్ కావడంతో

నైజీరియాలో ఐఎస్
ఉగ్రవాదుల బీభత్సం



- సైనిక స్థావరంపై దాడిలో 20 మంది మృతి
- దాడిలో ఐదుగురు పౌర సేన సభ్యులు కూడా మృతి
- ఆయుధాలు దోచుకుని బేస్ క్యాంపును తగలబెట్టిన ఉగ్రవాదులు
- నైజీరియాలో మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిన హింస - మిగతా 2 లో

భారత్‌లో పెరుగుతున్న వృద్ధులు మారుతున్న ఉద్యోగ సమీకరణాలు



- భారత్‌లో భారీగా పెరుగుతున్న వృద్ధుల జనాభా
- 2050 నాటికి 20 శాతానికి పైగా చేరనున్న సీనియర్ సిటిజన్లు
- రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగాల కోసం పెరుగుతున్న ఆసక్తి
- అనుభవానికి విలువనిస్తూ కొత్త అవకాశాలు కల్పిస్తున్న కంపెనీలు
- సామర్థ్యం ఆధారంగా నియామకాలు జరగాలంటున్న నిపుణులు

భారతదేశంలో జనాభా స్వరూపం వేగంగా మారుతోంది. దేశంలో వృద్ధుల సంఖ్య - మిగతా 2 లో

సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ

- కోర్టు ధిక్కరణ కేసులో అఫిడవిట్ దాఖలు
- రైసీనా హిల్స్ పరిధిలో 24 గంటల పాటు సెల్యులర్ సేవలు నిలిపివేసినట్లు వెల్లడి
- సీఈసీ రాజీనామా కోరుతూ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు తెలిపిన ఢిల్లీ పోలీస్ కమిషనర్



దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సందర్భంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించి - మిగతా 2 లో

సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి



- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి, సీఎం
- మహిళాశక్తికి రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
- గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ గుర్తింపు తేవడమే మేళా ఉద్దేశం
- ద్వాక్రా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని వెల్లడి
- త్వరలో ద్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు కావాలన్న సీఎం

2 లో..

సీఎం రేవంత్ ఆదేశాల అమలు.. విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి – జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

మొదటిపేజీ తరువాయి – బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి – రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

గడ్డంతో న్యూ లుక్.. అసలు కారణం చెప్పిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి – వీడియోలు ప్రస్తుతం అంతర్జాలంలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు దీనిని 'మాస్ లుక్' అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. నిన్న రామగుండంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో పాల్గొనేందుకు కేటీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయల్దేరిన సమయంలో ఆయన గడ్డంతో కనిపించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అనంతరం పర్యటన మార్గమధ్యంలో కరీంనగర్ వద్ద మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సతీశ్ బాబు వంటి నేతలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తన గడ్డం వెనుక ఉన్న కారణాన్ని కేటీఆర్ సరదాగా వెల్లడించారు. 'ఏందీ సంగతి.. గడ్డం పెంచినవ్?' అని గంగుల కమలాకర్ అడగ్గా, కేటీఆర్ తనదైన శైలిలో నవ్వుతూ సమాధానమిచ్చారు. "పోయేది గోదావరిఖనికే కదా.. సింగరేణికే కదా! ఆ మాత్రం ఉండాలే.. లేకపోతే నడవదు" అంటూ చమత్కరించారు. సింగరేణి ప్రాంత పర్యటనకు వెళ్తున్నందునే ఈ రకంగా సిద్ధమయ్యానని ఆయన చెప్పడంతో అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. కేటీఆర్ కొత్త లుక్ పట్ల ఆయన అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఆయన ఫొటోలను షేర్ చేస్తూ 'బాస్ ఈజ్ బ్యాక్ విత్ ఏ మాస్ లుక్' వంటి కామెంట్లతో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సాధారణంగా రాజకీయ నాయకులు తమ ఆహార్యం విషయంలో పెద్దగా మార్పులు చేయరు. అయితే, కేటీఆర్ తన లుక్‌ను మార్చడం, దానికి సింగరేణి ప్రాంతాన్ని ముడిపెడుతూ సరదాగా వ్యాఖ్యానించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

నౌకలోని 21 మంది సిబ్బంది సురక్షితంగా గట్టెక్కారు



మొదటిపేజీ తరువాయి – సరుకు రవాణా నౌక సముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదం అనంతరం సముద్ర ఉపరితలంపై ఐఫోన్లు, ఖరీదైన పెర్ఫ్యూమ్ బాటిళ్లు తేలియాడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రమాదానికి గురైన నౌక నుంచి చెల్లాచెదురైన లగ్జరీ వస్తువులను సేకరించేందుకు స్థానికులు చిన్న పడవల్లో పోటీ పడుతున్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దుబాయ్ నుంచి బయలుదేరిన సింగపూర్ పతాకం కలిగిన కంటైనర్ నౌక 'జీఎఫ్ఎస్ ప్రైడ్' బుధవారం ప్రమాదానికి గురైంది. ఏదో గుర్తుతెలియని వస్తువు ఢీకొనడంతో నౌకలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, అనంతరం అది నీట మునిగిందని మారిటైమ్ అధికారులు వెల్లడించారు. అయితే, నౌకలోని 21 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించామని, ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం కలగలేదని సింగపూర్ మారిటైమ్ అండ్ పోర్ట్ అథారిటీ ప్రకటించింది. ఈ నౌకలో సుమారు 2,500 కంటైనర్ల నిండా ఐఫోన్లు, ఖరీదైన పెర్ఫ్యూమ్‌లు వంటి విలాసవంతమైన వస్తువులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) స్పందిస్తూ, సదరు నౌక అనధికార మార్గంలో ప్రయాణిస్తూ సముద్రగర్భంలోని మైన్‌ను ఢీకొట్టడం వల్లే మునిగిపోయిందని పేర్కొంది. అయితే, నౌకపై గుర్తుతెలియని ప్రొజెక్టైల్ దాడి జరిగిందని ఇతర అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాలతో ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రపంచ చమురు, సహజవాయువు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు పెరిగిపోతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవలే అక్టోబర్ 6న, అమెరికా నౌకలపై నిఘా పెడుతోందని ఆరోపిస్తూ యూఎస్ దళాలు ఒక ఇరాన్ నౌకను ధ్వంసం చేశాయి. అంతకుముందు, సెప్టెంబర్ 23న జరిగిన దాడిలో 'కేప్ డావో' అనే మరో నౌక దెబ్బతిని, మునిగిపోయింది. ఆ ఘటనలో ఒకరు మరణించారు. గత 48 గంటల్లోనే ఈ ప్రాంతంలో డ్రోన్ దాడులతో సహా ఐదు ఘటనలు నమోదయ్యాయని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజెన్సీ నివేదించింది. ఈ పరిణామాలు జలసంధిలో వాణిజ్య రవాణా భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ



మొదటిపేజీ తరువాయి – దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అక్టోబర్ 9వ తేదీ రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు, అంటే 24 గంటల పాటు రైసీనా హిల్స్ పరిసరాల్లోని 4 కిలోమీటర్ల వ్యాసార్ధంలో సెల్యులర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయితే, వై-ఫై, బ్రాడ్‌బ్యాండ్ వంటి సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని హోం సెక్రటరీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. కాగా, నిరసనల సందర్భంగా మెట్రో, రైళ్లు సహా ఇతర అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ఈ ఆదేశాలను ఉల్లంఘించడమేనంటూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర హోం కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సహా ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోనే హోం సెక్రటరీ తాజాగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ సమర్పించారు. మరోవైపు, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సైతం తన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. జులై 20న జరిగిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, నిరసనకారులను నియంత్రించడం కష్టతరంగా మారడం, సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం వంటి కారణాలతో అక్టోబర్ 10న తలపెట్టిన ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

పాకిస్థాన్‌లో తీవ్ర విషాదం.. స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి



మొదటిపేజీ తరువాయి – పాకిస్థాన్‌లో గురువారం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల భవనం పైకప్పు కూలిన ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక ఉపాధ్యాయురాలు సహా మొత్తం 29 మంది దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో 40 మందికి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పెషావర్‌లోని దిర్ కాలనీ ప్రాంతంలో ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకున్నట్లు నగర పోలీస్ చీఫ్ మియాన్ సయీద్ వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించి పాఠశాల యజమానిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసే చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో ఆరుగురు బాలికల సహా 28 మంది విద్యార్థులు, ఒక మహిళా ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారని లేడీ రీడింగ్ ఆసుపత్రి ప్రతినిధి మహమ్మద్ అసిమ్ ధృవీకరించారు. మరణించిన చిన్నారులందరూ 13 ఏళ్లలోపు వారేనని ఆయన పేర్కొన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిని ప్రకటించినట్లు వివరించారు. భవనం కూలిన ఘటనపై పెషావర్ డిప్యూటీ కమిషనర్ అఫాక్ వజీర్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండవచ్చనే అనుమానంతో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ దారుణ ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రావిన్స్ గవర్నర్ ఫైజల్ కరీం కుండి కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

భారత్‌లో పెరుగుతున్న వృద్ధులు.. మారుతున్న ఉద్యోగ సమీకరణాలు

మొదటిపేజీ తరువాయి – గణనీయంగా పెరుగుతుండటంతో, పదవీ విరమణ వయసు తర్వాత కూడా ఉపాధి అవకాశాలపై కొత్తగా చర్చ మొదలైంది. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'ఇండియా ఏజింగ్ రిపోర్ట్' ప్రకారం 2022లో దేశ జనాభాలో 10.5 శాతంగా ఉన్న 60 ఏళ్ల పైబడిన వారి సంఖ్య, 2050 నాటికి 20 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా. ఈ పరిణామం సంప్రదాయ పదవీ విరమణ భావనను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. రిటైర్మెంట్ తర్వాత కూడా పనిచేయడానికి సీనియర్ సిటిజన్లు ఆసక్తి చూపుతున్నారని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'నేషనల్ కెరీర్ సర్వీస్' పోర్టల్‌లో వృద్ధులకు అనువైనవిగా భావిస్తున్న సుమారు 1.68 లక్షల ఉద్యోగ ఖాళీలు నమోదయ్యాయి. అదే సమయంలో దాదాపు 1.89 లక్షల మంది సీనియర్ సిటిజన్లు ఉద్యోగాల కోసం ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం గమనార్హం. ఇది పని చేయడానికి వారిలో ఉన్న ఆసక్తిని, మార్కెట్లో ఉన్న అవకాశాలను సూచిస్తోంది. ప్రభుత్వ వేదికలే కాకుండా 'విజ్డమ్‌సర్కిల్' వంటి ప్రైవేట్ ప్లాట్‌ఫామ్‌లు కూడా అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్‌ను, రిటైర్ అయిన వారిని కంపెనీలతో అనుసంధానిస్తున్నాయి. కన్సల్టింగ్, మెంటరింగ్, ప్రాజెక్ట్ ఆధారిత పనుల కోసం వీరి నైపుణ్యాలను సంస్థలు ఉపయోగించుకుంటున్నాయి. వయసును కాకుండా వారి అనుభవాన్ని, నైపుణ్యాన్ని గౌరవించే ఫ్లెక్సిబుల్ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోందనడానికి ఇది నిదర్శనం. ఇటీవల ముంబైకి చెందిన ఒక స్టార్టప్‌లో 64 ఏళ్ల వ్యక్తి ఇంటర్న్‌గా చేరడం వంటి సంఘటనలు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. అయితే, ఈ మార్పు అంత సులభం కాదు. వయసు పెరిగిన వారు టెక్నాలజీకి అంత తొందరగా అలవాటుపడలేరని, వారికి ఎక్కువ జీతాలు ఇవ్వాల్సి వస్తుందనే కొన్ని అపోహలు నియామకాలకు అడ్డంకిగా మారుతున్నాయి. కానీ, వాస్తవానికి సీనియర్ ఉద్యోగులు తమతో పాటు అపారమైన సంస్థాగత పరిజ్ఞానం, బలమైన వృత్తిపరమైన నెట్‌వర్క్‌లు, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని తీసుకొస్తారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పనిచేసే కాలాన్ని పొడిగించడం, శ్రామిక శక్తిలో వృద్ధుల భాగస్వామ్యాన్ని పెంచడం, ఫ్లెక్సిబుల్ రోల్స్ కల్పించడం వంటివి దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణపై భారం తగ్గడమే కాకుండా, దేశ వృద్ధికి కూడా దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో అనేక కంపెనీలు నిరంతర అభ్యాసం, దశలవారీ పదవీ విరమణ, తరం-తరం మధ్య సహకారంతో పనిచేసే బృందాలు వంటి నూతన విధానాలను అన్వేషిస్తున్నాయి. అంతిమంగా వయసును ఒక అడ్డంకిగా చూడకుండా, వారి సామర్థ్యం, అనుభవం ఆధారంగా అవకాశాలు కల్పించే పారదర్శకమైన వ్యవస్థను నిర్మించడమే అసలైన సవాలు.

సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి



మొదటిపేజీ తరువాయి – విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలిసారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియాడారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని ప్రశంసించారు. మహిళా శక్తిని చాటేందుకే విజయవాడలో ఈ మేళాను ఏర్పాటు చేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 650 స్టాళ్లు మహిళల నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ఉత్పత్తులు జాతీయ ఉత్పత్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా ఒక చరిత్ర సృష్టిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం డ్వాక్రా సంఘాలు రూ.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుంటూ, లక్ష కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయని, త్వరలోనే ఇది రూ.10 లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. త్వరలోనే పది లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆరు కోట్ల మందిని వ్యాపారవేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆయన స్ఫూర్తి ప్రశంసనీయమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తమ ఆశయమని సీఎం స్పష్టం చేశారు.

నైజీరియాలో ఐఎస్ ఉగ్రవాదుల బీభత్సం



మొదటిపేజీ తరువాయి – నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పెను విధ్వంసం సృష్టించారు. ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో ఉన్న ఓ సైనిక స్థావరంపై ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ ఉగ్రవాదులు మంగళవారం రాత్రి భీకర దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 మంది సైనికులు, ఐదుగురు పౌర సేన సభ్యులు (యాంటీ-జిహాదిస్ట్ మిలీషియా) మరణించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. లేక్ చాద్ ప్రాంతంలోని మైరారీ గ్రామంలో ఉన్న ఈ సైనిక స్థావరాన్ని ఉగ్రవాదులు పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆయుధాలను దోచుకుని, స్థావరంలో ఉన్న వాహనాలతో సహా అన్నింటికీ నిప్పుపెట్టి బేస్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన సైనికులు సమీపంలోని మోంగునో పట్టణానికి చేరుకున్నారు. మరికొందరు సైనికుల ఆచూకీ గల్లంతవగా, వారిని ఉగ్రవాదులు బంధించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, రాత్రి 10 గంటల ప్రాంతంలో మొదలైన ఈ దాడి ఉదయం వరకు కొనసాగింది. ఉగ్రవాదులు సైనికులను తరిమికొట్టి, స్థావరంలోని విలువైన వస్తువులన్నింటినీ దోచుకుని, మిగిలిన వాటిని తగలబెట్టారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొరుగున ఉన్న గుడుంబాలి ప్రాంతం నుంచి ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా నైజీరియాలో ఉగ్రవాద హింస విపరీతంగా పెరిగింది. బోకో హరామ్, దాని నుంచి విడిపోయిన ఐఎస్ డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద సంస్థలు దాడులకు తెగబడుతున్నాయి. 17 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ హింసలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. గత మూడు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత తీవ్రమైన హింసాత్మక పరిస్థితులు ప్రస్తుతం నైజీరియాలో నెలకొన్నాయని ఏసీఎల్ఈడీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

అలాంటి వాళ్లను కాల్చి చంపాలి.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి – సైనిక చర్య సమయాన్ని మార్చాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇలాంటి వారికి జీవితాంతం జైలు శిక్ష విధించాలని కూడా వ్యాఖ్యానించారు. అరిజోనా రాష్ట్రంలోని బుల్‌హెడ్ సిటీలో ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ముందు అమెరికా బాంబర్లు బయలుదేరే, చేరుకునే సమయాలు మీడియాకు చేరాయని ఆరోపించారు. ఈ వివరాలు న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్‌లో వచ్చినట్లు పేర్కొన్నారు.

దాడి సమయం మార్చాల్సి వచ్చింది!

మిస్సోరీ నుంచి బీ-2 స్టెల్త్ బాంబర్లు బయలుదేరే సమయం బయటకు పొక్కడంతో ఆపరేషన్ ప్రమాదంలో పడిందని ట్రంప్ చెప్పారు. ఈ విషయంపై సీనియర్ సైనికాధికారులతో చర్చించినట్లు తెలిపారు. జనరల్ రజిన్ కేన్‌తో మాట్లాడిన తర్వాత దాడిని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అప్పటికే దాడికి సిద్ధమైన పైలట్లు ఈ నిర్ణయంతో నిరాశకు గురయ్యారని చెప్పారు.

రెండు రోజుల తర్వాత దాడి

తొలుత అనుకున్న దాడిని రెండు రోజుల తర్వాత నిర్వహించినట్లు ట్రంప్ తెలిపారు. మొదట లీకైన సమయానికే బాంబర్లను పంపామని, దీంతో ఇరాన్ సైన్యాన్ని ఆశ్చర్యానికి గురిచేయగలిగామని పేర్కొన్నారు. అమెరికా సైనిక చర్యను ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా అభివర్ణించారు.

అయితే, లీకేజీకి పాల్పడిన వ్యక్తి ఎవరనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఆరోపణలకు మద్దతుగా ఆధారాలు చూపలేదు. ఈ వ్యవహారంలో విచారణ ద్వారా ఎవరినైనా గుర్తించారా? అన్నదానిపైనా స్పష్టత ఇవ్వలేదు.

గూఢచర్య చట్టం కింద చర్యలు

అమెరికాలో జాతీయ రక్షణకు సంబంధించిన సమాచారాన్ని అనధికారికంగా బయటపెట్టడంపై కఠిన చట్టాలున్నాయి. అందులో 'ఎస్పియోనేజ్ యాక్ట్' కీలకమైనది. ఈ చట్టం కింద రహస్య సమాచారాన్ని అక్రమంగా భద్రపరచడం, ఇతరులకు చేరవేయడం వంటి చర్యలపై కేసులు నమోదు చేయవచ్చు. ఈ నేపథ్యంలో సైనిక రహస్యాల లీకేజీపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బీసీలకు 34% కాదు 40% స్థానాలను ఇస్తున్నాం

-బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, శాసనసభ్యులు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం



శ్రీకాళహస్తి **అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక:** గడించిన నాలుగు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో బీసీల రాజకీయ ఎదుగుదలకు, సామాజిక మరియు ఆర్థిక పురోగతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేడు ఎన్డీయే కూటమి పార్టీలోని ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో బీసీలకు 34% శాతం కాకుండా నలభై శాతం పైగా స్థానాలను కేటాయించడం శుభపరిణామం అని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. తమ ఎదుగుదలకు తోడ్పడింది తెలుగుదేశం పార్టీనే తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారన్న ఏకైక కారణంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని సహించలేని జగన్ కేసులేసి అడ్డుకున్నాడని ఆరోపించారు. కానీ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం చంద్రబాబు చొరవతో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో 40 శాతం రిజర్వేషన్ ఇచ్చి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం శుభపరిణామం అని కొనియాడుతూ, తమ బీసీ వర్గాల పట్ల ఎన్డీయే కూటమి ప్రభుత్వం మరియు తెలుగుదేశం పార్టీ చూపిన ఆత్మీయ ఆదరణకు కృతజ్ఞతగా శుక్రవారం స్థానిక శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ని పలువురు బీసీ నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపి, వారిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, విఘ్నేశ్వరుని దారు శిల్పాన్ని ఆయనకు బహూకరించారు. తండ్రి బాటలో తనయుడు శ్రీకాళహస్తి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో కూడా గతంలో తన తండ్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆదరించిన విధంగానే, నేడు తాను కూడా బీసీలకు 40% శాతానికి మించి స్థానాలను కేటాయించడం జరుగుతున్నదని, 'బి' అంటే...బొజ్జల/బీసీ అనే విధంగా గత నాలుగు దశాబ్దాలుగా బొజ్జల కుటుంబానికి బీసీ లతో అవినాభావ సంబంధం ఏర్పడిందని కొనియాడారు.

సమాజ అభివృద్ధిలో బీసీలది అతిముఖ్యమైన పాత్ర

భారతదేశంలో ఏ రంగమైనా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్ళాలంటే సమాజంలో సగభాగం ఉన్న బీసీల పురోభివృద్ధితోనే అది సాధ్యం అవుతుందని, కాబట్టే నాటి యన్టీఆర్ నుండి నేటి చంద్రబాబు వరకు తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న బీసీ విధానం మేరకు బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు సీఎం చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. బీసీలకు రాజకీయంగా అన్యాయం జరగనివ్వబోమని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున బీసీలకు ఏకంగా 40 శాతం టిక్కెట్లు కేటాయించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పేట బాలాజీ రెడ్డి, డిల్లీ బాబు, బీమాల మునికృష్ణ, మునిరాజా యాదవ్, గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు, భాస్కర్ గౌడ్, నాగరాజు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, యం.యస్.రెడ్డి, మురళి, రామచంద్రయ్య, సిద్దులయ్య, పూల శేఖర్, శంకరయ్య, గాజుల భగత్, గగన్ యాదవ్, సులేమాన్, శివ ఆచారి, శేషు, బాబు రెడ్డి, ఓంకార్, చంద్రశేఖర్, రమేష్, మణెయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ఎన్నికల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.

నామినేషన్ల నుంచి కౌంటింగ్ అనంతరం వరకు పటిష్ట బందోబస్తు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా -- ట్రబుల్ మ్యాంగర్స్‌పై బైండోవర్ చర్యలు.

పల్లె నిద్ర, గ్రామసభల ద్వారా ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించాలి.

ప్రతిరోజూ కార్డాన్ సెర్చ్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం చేయాలి.

చెక్‌పోస్టుల వద్ద 24/7 అప్రమత్తత తప్పనిసరి.

ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం.

జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్.





శ్రీకాకుళం,అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక: జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్నికల సన్నద్ధతపై పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించి, ఎన్నికల భద్రత, బందోబస్తు ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా, ముందస్తు నివారణ చర్యలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల నుంచి కౌంటింగ్ అనంతరం వరకు పటిష్ట బందోబస్తు: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ అనంతరం వరకు ప్రతి దశకు ముందస్తు ప్రణాళికతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన బలగాలను కేటాయించాలని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా: గతంలో ఎన్నికల సమయంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని, ఎన్నికలకు విఘాతం కలిగించే వ్యక్తులుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ కార్డాన్ సెర్చ్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం చేయాలి: జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ కార్డాన్ సెర్చ్‌లు నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై నిఘా పెంచాలని సూచించారు. అక్రమ మద్యం, నగదు, ఓటర్లను ప్రభావితం చేసే ప్రలోభాల నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద 24/7 అప్రమత్తత తప్పనిసరి: జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన 11 చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది 24/7 అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. వాహన తనిఖీలు నిరంతరం చేపడుతూ అక్రమ నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే స్పందించాలని తెలిపారు. పల్లె నిద్ర, గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి.పల్లె నిద్ర కార్యక్రమాలు, గ్రామసభల ద్వారా ప్రజలకు ఎన్నికల మార్గదర్శకాలు, ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రలోభాలకు లోనుకాకుండా, బెదిరింపులకు భయపడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించాలని తెలిపారు. ట్రబుల్ మ్యాంగర్స్‌పై బైండోవర్ చర్యలు: ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారి కదలికలపై నిఘా ఉంచుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎన్నికల ప్రతి దశలో పటిష్ట భద్రత కల్పించి, ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు ధనుంజయ నాయుడు, లక్ష్మణరావు, వెంకట రమణ, భాస్కర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజుతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై దృష్టి సారించాలి...ఎన్‌సీడీ


జిల్లా అధికారి డాక్టర్ జగన్ మోహన్



సీతానగరం, **అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక:** ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, నివేదికలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్‌సీడీ జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. శుక్రవారం సీతానగరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, వైద్య సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఈహెచ్‌ఆర్ నమోదు, మాతా శిశు సంరక్షణ, ఎన్‌సీడీ సర్వే , ఆర్.బి.ఎస్.కె స్క్రీనింగ్, ఫ్రైడే డ్రైడే తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. వ్యాధుల లక్షణాలను ముందుగానే గుర్తించి క్షేత్ర స్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. కుక్కకాటు, పాముకాటు, రోడ్డు ప్రమాద కేసుల నమోదు, చికిత్స వివరాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది పనితీరుపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని వైద్యాధికారికి సూచించారు. ఆసుపత్రి ఆవరణను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి. ఉషారాణి, సీహెచ్ఓ ఎస్‌వీ రమణ, ఆరోగ్య పర్యవేక్షకులు భవాని, గోపాల్ నాయుడు, యుడిసి మురళీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించిన

దుర్గామాత సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు



జిహెచ్ఎంసి నాదర్‌గుల్ డివిజన్‌లోని శ్రీ గంగా పార్వతి సమేత సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించిన దుర్గామాత సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఉత్సవాల సందర్భంగా 'నాట్య కళా డాన్స్ అకాడమీ' బృందం ప్రదర్శించిన నృత్యాలు భక్తజనాన్ని మైమరిపించాయి. ప్రముఖ నృత్య గురువు దీప్తి కృష్ణ పర్యవేక్షణ, ఆధ్వర్యంలో అకాడమీ విద్యార్థులు అత్యంత అద్భుతమైన నాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పిల్లల్లో దాగివున్న కళాత్మక ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రుల సహకారం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి సన్నిధిలో జరిగిన ఈ నృత్యోత్సవం ఆలయ ప్రాంగణంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాం బద్రినాథ్, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వమే భరోసా ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్లలో 37 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చేవెళ్ల, అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక: పేదింటి ఆడపిల్లల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా కొండంత అండగా నిలుస్తోందని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల మండలం, మున్సిపాలిటీ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 37,00,592 విలువైన చెక్కులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా సంక్షేమ ఫలాలు నేరుగా అర్హులకు అందేలా చూస్తున్నామన్నారు. ఆడబిడ్డల పెళ్లి సమయంలో ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపశమనాన్ని ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర కాలనీ లో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి

సరస్వతీదేవి అలంకరణలో కొలువు తీరింది



కుత్బుల్లాపూర్,అక్టోబర్ 16 (విజన్ పక్షం దినపత్రిక): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ నాయకి స్కూల్ యాజమాన్యం శ్రీ నాయకి శ్రీనివాసరావు అమ్మవారి దీవెనలతో ఆలయ ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాలు,పెన్నులు పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు ఆలయ కమిటీ చైర్మన్ టి.రాజేశ్వర్,శివ,శంకర్ పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థిలు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్





ఇచ్ఛాపురం, **అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ స్పష్టిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఇచ్ఛాపురం మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను, భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు, బెదిరింపులు, ఓటర్ల ప్రలోభాలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఏమాత్రం సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఎన్నికల్లో పాల్గొనాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. అలాగే సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులను ప్రచారం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికలకు ఈ నెల 21 నుండి నామినేషన్ల స్వీకరణ

సన్నద్ధతపై సమీక్షించిన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్





శ్రీకాకుళం, **అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక:** ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు ఎన్నికల మాన్యువల్‌ను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, నిర్దేశిత గడువులోనే పనులన్నీ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, నవంబర్ 3న ఎన్నికలు, 5న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించామని, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు ఇంచార్జ్‌లుగా, ఎంపీడీఓలు అసిస్టెంట్ అథారిటీలుగా వ్యవహరిస్తారని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతుల బాధ్యతను పంచాయతీ రాజ్ ఎస్ఈకి, వాహనాల ఏర్పాట్లను ఉప రవాణా కమిషనర్‌కు అప్పగించామని పేర్కొన్నారు. అలాగే ఆయా జిల్లా ఉన్నతాధికారులు వారికి కేటాయించిన పనులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, ఫోటోలను వెంటనే తొలగించాలని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. సిబ్బంది నియామకం పూర్తయిందని, వారికి తక్షణమే శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్, రిసెప్షన్ కేంద్రాల వద్ద అవసరమైన లాజిస్టిక్స్, రక్షణ ఏర్పాట్లను పూర్తి చేయాలని నోడల్ అధికారులను పిలుపునిచ్చారు. ప్రతి సెగ్మెంట్‌కు అవసరమైన మానవ వనరులను కేటాయించి, వారి విధులపై స్పష్టమైన సమన్వయం వహించాలని తెలిపారు. రోజువారీ ఎన్నికల సన్నద్ధత, చెక్‌లిస్ట్‌ల వివరాలను ఉన్నతాధికారులకు క్రమం తప్పకుండా నివేదించాలని, కంట్రోల్ రూమ్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ క్షేత్రస్థాయి విధులను నిరంతరం పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఇతర జిల్లా స్థాయి నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి

ఆర్ . అండ్.బి. పర్యవేక్షక ఇంజనీర్, పి. సత్యనారాయణ.






శ్రీకాకుళం **అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక:** ఉద్యోగులు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆర్.అండ్. బి. పర్యవేక్షక ఇంజనీర్, పి. సత్యనారాయణ అన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 21 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్.అండ్ బి. శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లు మరియు భవనాలు శాఖ పరిధిలోని ఉద్యోగులు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రోడ్లు మరియు భవనాలు శాఖ పర్యవేక్షక ఇంజనీర్, పి. సత్యనారాయణ తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించడం ఉద్యోగుల విధి అని పేర్కొన్నారు. చట్టం నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే దరఖాస్తుదారులకు సరైన సమాచారం అందించగలమని తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు తమకు అవసరమైన సమాచారాన్ని పొందే అవకాశం కల్పించబడిందని, ఈ చట్టం నిబంధనలపై ఉద్యోగులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రిసోర్స్ పర్సన్ కొమ్మాజోశ్యుల. వసంతకుమార్ చట్ట నిబంధనలు, దరఖాస్తుదారులకు సమాచారం అందించే విధానం, చట్ట పరిధిలోకి వచ్చే అంశాలు, అప్పీళ్ల పరిష్కార ప్రక్రియ తదితర అంశాలను వివరించారు. ఉద్యోగులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ . అండ్ బి. శ్రీకాకుళం, టెక్కలి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, కె.వి.ప్రసాదరావు, ఇ. రవికాంత్, డి.ఇ.ఇలు, యన్.దనుంజయ, జె.జగన్మోహనరావు, ఆర్.గణపతిరవు,కె.పాండురంగారావు,బి..విశాలగుప్త, బి.వాసుదేవరావు,జి. సరోజ, సి.హెచ్.విద్యావాణి, సహాయ ఇంజినీర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.

-జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్.



శ్రీకాకుళం, అక్టోబర్ 16, విజన్ పక్షం దినపత్రిక: పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ,నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి అని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్., ఆదేశించారు జిల్లా ఎస్పీ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ప్రజా ఫిర్యాదులు,పెండింగ్ కేసుల పరిష్కారం, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, దర్యాప్తులో నాణ్యతను పెంపొందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు.నేరం జరిగిన వెంటనే స్పందించి, నేర స్థలాన్ని సందర్శించి భౌతిక సాంకేతిక ఆధారాలతో నిందితులను త్వరితగతిన గుర్తించి, అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టాలని, ప్రతి కేసులో నేరానికి గల కారణాలను అన్ని కోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, పటిష్టమైన ఆధారాలతో కేసులను పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు ధనుంజయ నాయుడు, లక్ష్మణరావు, వెంకట రమణ, భాస్కర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజుతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విజన్ పక్షం
శనివారం 17-10-2026

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, బ్రాహులి.. ప్రాచీన ద్రవిడ భాష ఏది?



గతవారం నటుడు కమల్ హాసన్ తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందని ప్రకటించి ఒక పెద్ద వివాదానికి తెరదీశారు. ఏ భాష ప్రాచీనమైనది? అన్న ప్రశ్న 20వ శతాబ్దపు మధ్యనాటి నుంచి ఈ గడ్డపై రాజకీయంగా వేడి పుట్టిస్తూనే ఉన్నది. ఈ జాతీయత ఆగ్రహావేశాల అడుగున పురావృక్షశాస్త్రవేత్తలు, భాషా చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు కనిపెట్టిన అబ్బురపరిచే విషయాలు ఎన్నో దాగున్నాయి. అంతరించిపోయిన గంగా మైదానపు 'లాంగ్వేజ్ ఎక్స్' నుంచి ఆగ్నేయాసియా భాషల మూలాలు, మూల ద్రవిడ భాషీయుల ప్రాదేశికత వరకు లోతుగా తరచి చూస్తే చరిత్ర పూర్వ భారతీయ భాషలు ఇప్పటిలాగే ఎంతో వైవిధ్యంతో కూడుకొని ఉన్నట్టు స్పష్టమైపోతుంది. అసలు ద్రవిడ భాషలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఈ రోజుల్లో ద్రవిడియన్ లేదా ద్రవిడ అనే మాటను భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి ఉపయోగిస్తున్నారు. ఇది జాతీయత, సంస్కృతి, రాజకీయాలతో ముడిపడి ఉంది. కానీ, నేను ఇక్కడ భాషాపరమైన అర్థంలో మాత్రమే దీన్ని ఉపయోగిస్తున్నాను. ద్రవిడియన్ భాషలపై భద్రిరాజు కృష్ణమూర్తి రాసిన 'ద్రవిడియన్ లాంగ్వేజేస్' (2003) ప్రకారం భారతదేశపు దక్షిణాగ్రం నుంచి మధ్య భారతం వరకు ఈ భాషలను మాట్లాడుతారు. ఒకే ఒక ఉలిపికట్టె ద్రవిడభాష.. బ్రాహుయీ ప్రస్తుత పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ పశ్చిమ ప్రాంతంలో ఉంది. పురామానవ శాస్త్రవేత్త, చరిత్రకారుడు థామస్ ట్రావుట్మన్ 'ద్రవిడియన్ కిన్‌షిప్' (1981) పుస్తకంలో మహారాష్ట్రలోని అనేక స్థలనామాల్లో ద్రవిడియన్ పదాలు అంతర్లీనంగా ఉన్నాయని, అంతేకాకుండా ద్ర విడియన్ సాంస్కృతిక ఆచారాలు.. మేనరికపు పెండ్లిళ్ల వంటివి కూడా అక్కడ విస్తారంగా ఉ న్నాయని రాశారు. ఆ మాటకు వస్తే సింధ్, గుజరాత్ ప్రాంతాల్లో కూడా ఈ ప్రభావాలున్నాయని ఆయన చెప్పారు. ద్రవిడ భాషలు మాట్లాడేవారు భారత్‌లో అత్యంత విస్తారంగా ఉన్నారని దీన్ని బట్టి మనకు అర్థమవుతున్నది. ఈ సువిశాలమైన భౌగోళిక విస్తృతిని గమనిస్తే 'అసలైన' ద్రవిడ భాషీయులు ఎవరు? వారు ఎలా విస్తరించారు? ఎందుకు విస్తరించారు? అనే ప్రశ్న సహజంగానే ముందుకొస్తుంది. అన్ని ద్రవిడ భాషల తొలినాళ్ల సామ్యాలను పరిశీలిస్తే మనం నేటి భాషలన్నిటి ఆవిర్భావానికి మూలమైన ఒక ఆది-ద్రవిడియన్ భాషను ఊహించుకోవచ్చు. అప్పటివాళ్లు చూసిన మొక్కలు ఏవో, జంతువులు ఏవో, వారు బతికిన వాతావరణ పరిస్థితులు ఎలాంటివో, వారి రాజకీయాలేమిటో, వారి ఇండ్లు ఎలా ఉండేవో అంచనా వేసుకోవచ్చు. ఆ తర్వాత ఉపఖండ పర్యావరణం, పురావస్తు తవ్వకాల్లో వెలుగుచూసిన విషయాలను బేరీజు వేసుకొని పోలికలు చూసుకోవచ్చు. సుప్రసిద్ధ భాషాశాస్త్రవేత్త ఫ్రాంక్లిన్ సి సౌత్‌వర్త్ తన 'ప్రొటో ద్రవిడియన్ అగ్రికల్చర్' (2005) అనే పరిశోధన పత్రంలో కనిపించకుండాపోయిన పాతకాలపు ప్రపంచాన్ని శ్రమకోర్చి పునర్నిర్మించారు. మూలద్రవిడ భాష మాట్లాడేవారు రాజును ఉద్దేశించిన పదాన్నే మట్టి గుడిసెకు, మొత్తంగా ఊరికీ వాడేవాళ్లు. అంటే చిన్నచిన్న గూడేలు ఉండటం, అందులో దగ్గరి బంధువులు నివసించడం అందుకు కారణం కావచ్చు. వారికి ఎన్నో వ్యవసాయ, వేట పనిముట్ల గురించి, అనేక అడవి జంతువుల గురించిన జ్ఞానం ఉండేది. క్రీ.పూ. 3వ సహస్రాబ్దిలో సింధునది లోయలో హరప్పా నాగరికత వెల్లివిరుస్తున్న రోజుల్లో మూల ద్రవిడులకు అనేక పంటల గురించి, ముఖ్యంగా జొన్నలు, కొర్రలు, పప్పు ధాన్యాల వంటి అనేక పంటల గురించి బాగా తెలుసు. పశువుల కొట్టాలు, గొర్రెలు, మేకల పెంపకం గురించిన ప్రత్యేకమైన పదాలు వారు ఉపయోగించేవారు. ఇక చివరగా ప్రాచీన వృక్షశాస్త్రవేత్త డోరియన్ క్యూ ఫుల్లర్ తన 'నాన్ హ్యూమన్ జెనెటిక్స్: అగ్రికల్చరల్ ఆరిజిన్స్ అండ్ హిస్టారికల్ లింగ్విస్టిక్స్ ఇన్ సౌత్ ఏషియా' (2007)లో మూల ద్రవిడభాషలు పొడినేలల్లో, చిట్టడవుల మధ్య ఎక్కువకాలం నివసించిన సమాజాల నుంచి వచ్చాయని చెప్పారు. ఈ వర్గీకరణలన్నిటికీ చక్కగా సరిపోయే ప్రాంతం ఒకటి ఉంది. ఆధునిక ద్రవిడ భాషా కుటుంబాలు ఉత్తరాది, మధ్య భారతం, దక్షిణ మధ్య భారతం, దక్షిణాది.. ఒకదానితో ఒకటి కలగాపులగం అయిపోయిన ప్రాంతం అది. బహుశా ఇప్పటి భాషలన్నిటి ఆవిర్భావానికి అదే మూలస్థానమై ఉంటుందని దక్షిణాది నవీన శిలాయుగ దశకు చెందిన పురాతత్వ ప్రదేశాల్లో చిన్నచిన్న మట్టి ఇండ్లు, అటవీ, పెంపుడు జంతువులు, పంటల అవశేషాలపై విస్తారంగా జరిగిన పురాతత్వ పరిశోధనల ద్వారా తెలుస్తున్నది. సౌత్‌వర్త్ మూల ద్రవిడ భాషలో మొక్కలకు సంబంధించి సూచించిన పదజాలం దక్షిణాది నవీన శిలాయుగ పురావస్తు ప్రదేశాల్లో వినిపించే మాటలతో 73 శాతం సరిపోతున్నది. ప్రస్తుతం దక్షిణ భారత భాషా జాతీయవాద ఘర్షణలు, ఉద్రిక్తతలు జరుగుతున్న ప్రాంతానికి ఇది ఎంతో దూరంలో ఉండటం గమనార్హం. అవి దక్షిణ కర్ణాటక లేదా తమిళనాడు నుంచో రాలేదు. మూల ద్రవిడ భాషలు అభివృద్ధి చెందాయని చెప్పే ప్రాంతం ప్రస్తుత ఉత్తర కర్ణాటక, ఏపీ పరిధిలోకి వచ్చే కృష్ణా-గోదావరి లోయలో ఉండటం విశేషం. అంటే ఒక విషయం ఇక్కడ స్పష్టం చేయాలి. పైన చెప్పిన విషయాల అర్థం అన్ని ద్రవిడ భాషలు కృష్ణా-గోదావరి లోయలోంచి పుట్టుకు వచ్చాయని కాదు. నిజానికి ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు? ఎవరి మూలాలు ఎక్కడున్నాయి? అనేది చాలా క్లిష్టమైన ప్రశ్న. తూర్పు ఆఫ్రికా నుంచి ఆధునిక మానవుడు వచ్చాడనేది మాత్రమే నికరమైన సత్యం. నిజానికి మూలద్రవిడ భాషలోనూ ప్రస్తుతం ఆగ్నేయాసియా యాసలో ఎక్కువగా మాట్లాడే ఆస్ట్రో-ఏషియాటిక్ భాషా కుటుంబానికి చెందిన, భారత్‌లో వాటి ప్రతినిధులైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లోని 'ముండా' భాషలకు చెందిన కొన్ని పదాలుండేవి. తొలి దశ ద్రవిడులు సైతం కృష్ణా-గోదావరి లోయకు వేరే ఎక్కడి నుంచో, దారిలో ఇతర భాషల పదాలు గ్రహిస్తూ, వలస వచ్చారని ఇది సూచిస్తున్నది. కొన్ని జన్యుపరమైన, భాషా పరమైన సిద్ధాంతాలు ద్రవిడియన్ భాషలు ఇరాన్ పీఠభూమి నుంచి, హరప్పా నాగరికత నుంచి వచ్చాయని సూచిస్తాయి. కానీ, అది ప్రస్తుతం చర్చనీయాంశం కాదు. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. మూల ద్రవిడభాష దక్షిణాది నవీన శిలా యుగపు తవ్వకాలకు అచ్చుగుద్దినట్టు సరిపోయేదేమీ కాదు. దక్షిణాది నవీన శిలాయుగపు మనుషులు కుండల్లో ఖననం చేసే ఆచారాన్ని పాటించేవారు. అయితే మూల ద్రవిడంలో ఆ ఖననానికి సంబంధించిన పదజాలం లేదు. అదేవిధంగా హరప్పా నాగరికతకు సంబంధించిన అంశాలతోనూ అవి సరిపోవు. హరప్పా నగరాలను చూస్తే వారికి ఇంజినీరింగ్, జామెట్రీకి సంబంధించి బోలెడు పదజాలం ఉండవచ్చని అనిపిస్తుంది. కానీ, మూల ద్రవిడంలో అలాంటి పదాలేవీ లేవు. మూల ద్రవిడంలో 'ఖడ్గమృగం' అనేదానికి సమాన పదం లేదు. హరప్పా ముద్రలపై ఈ ప్రాణి తరచుగా కనిపించడం తెలిసిందే. అంటే ద్రవిడియన్ మాట్లాడేవాళ్లు హరప్పా నగరాల్లో లేరని దీన్నిబట్టి చెప్పడానికి వీల్లేదు. అంతటి విస్తృతమైన నాగరికతలో బహుళ భాషలు ఉండే అవకాశం ఉంది. అంటే ఇప్పుడు అంతరించిపోయిన ద్రవిడ కుటుంబానికి చెందిన ఓ భాష అక్కడ ఉపయోగించి ఉంటారు. తర్వాత కాలంలో మూల ద్రవిడం నుంచి విడిగా అది పరిణామం చెంది ఉంటుంది. మూల ద్రవిడ భాషలో పంటలకు సంబంధించి, ముఖ్యంగా గోధుమ గురించిన పదాలున్నాయి. వీటి మూలాలు హరప్పాలో ఉండవచ్చు. అంటే వ్యవసాయపరమైన ఇచ్చిపుచ్చుకోవడాలను ఇది సూచిస్తున్నది. నిజమైన ద్రవిడ మాతృభూమి ఏది? అనేది ఇప్పటికీ అస్పష్టమే. క్రీస్తుపూర్వం మూడవ సహస్రాబ్దిలో మూల ద్రవిడం మాట్లాడేవారు దక్షిణ భారత ద్వీపకల్పంలో వ్యవసాయం చేసేవారు. క్రీస్తుపూర్వం 11వ శతాబ్ది ప్రాంతంలో వారి జనాభా ఒక్కసారిగా పెరగడంతో భారత ఉపఖండమంతటా తెరలు తెరలుగా వారు వ్యాపించారు. స్థూలంగా చెప్పాలంటే, చిరుధాన్యాలు, పప్పులు, దుంపల పొడినేలల సేద్యం అనేది మూల ద్రవిడ వ్యవసాయ విధానాలుగా ఉండేవి. క్రీస్తుపూర్వం మొదటి సహస్రాబ్దిలో పత్తి, చెరకు వంటి వాణిజ్య పంటలతో పాటు ఆరుతడి వరి సేద్యం కూడా వచ్చిచేరింది. ఏతావాతా వరి అనేది కీలక స్థానంలోకి వచ్చి చేరింది. శతాబ్దాల క్రమంలో ద్రవిడ భాషీయులు జంతువులు, పంటలకు సంబంధించిన మాటలను ఉత్తర భారతదేశం మాత్రమే కాకుండా ఆగ్నేయాసియా భాషల నుంచి కూడా ఇచ్చిపుచ్చుకున్నారు. అందులో ఒక శాఖ దక్షిణాభిముఖంగా వెళ్లి దక్షిణాది ద్రవిడ భాషల అభివృద్ధికి దోహదం చేసి ఉంటుంది. కొన్ని బృందాలు నీలగిరి కొండల్లోకి పాకాయి. దీంతో ఇరుళ, తోడా వంటి భాషలు ఆవిర్భవించాయి. కోస్తా మైదాన ప్రాంతాల్లో కన్నడ, తమిళ, మలయాళ భాషలు ఆవిర్భవించాయి. ఇప్పుడు తమిళంగా పరివర్తన చెందిన భాష సుమారు క్రీస్తుపూర్వం 600 నాటికి ప్రత్యేక శాఖగా అభివృద్ధి చెంది ఉంటుందని కృష్ణమూర్తి 'ద్రవిడ భాషలు' గ్రంథంలో రాశారు. మూడు శతాబ్దాల తర్వాత అది పాత తమిళంగా అభివృద్ధి చెందింది. మొట్టమొదటిసారిగా వర్ణమాల కలిగిన, రాయదగ్గ భాషగా పరివర్తనం చెందింది. పాత తమిళం అనేక యాసలతో కూడి ఉండేది. కాలక్రమంలో అది మధ్య తమిళం, ఆధునిక తమిళంగా రూపుదిద్దుకుంది. క్రీస్తుపూర్వం 800-1200 మధ్యకాలంలో కొన్ని తమిళ యాసలు కలిసి మలయాళ శాఖగా మారిపోయాయి. కన్నడ భాష మూలం తమిళంలో లేదని మనం నమ్మకంగా చెప్పవచ్చు. కన్నడ అనేది ఇక్కడ నీలగిరుల నుంచి పాత తమిళం దాకా సంబంధం ఉన్న దక్షిణ ద్రవిడ భాష. అయితే దాని మూలరూపాలు మనకు ఇప్పుడు కనిపించకుండాపోయాయి. దురదృష్టవశాత్తు అతి ప్రాచీన కన్నడ లిపి అనేది 450 క్రీస్తు శకం నాటిది మాత్రమే లభిస్తున్నది. దీంతో అంతకు మునుపటి శతాబ్దాల్లో ఈ భాష ఎలా పరిణామం చెందిందనేది మనకు తెలియరావడం లేదు. తర్వాత కాలంలోనూ కన్నడలో అనేక ప్రాంతీయ యాసలు పుట్టుకువచ్చి అవి పాత కన్నడం, మధ్య కన్నడం, నవీన కన్నడంగా పరిణామం చెందాయి. ఉత్తర కర్ణాటకలో కన్నడ యాసల్లో మరాఠీ వంటి ఎన్నో ఆర్యన్ భాషల నుంచి వచ్చిచేరిన పదాలూ కనిపిస్తాయి. అందులోనూ ద్రవిడ అంతర్లీన లక్షణాలు కలిగిన పదాలే అధికం. ఈ భాషాపరమైన అరువులు, పరిణామాలు, వలసలు, మార్పిడులు అనే సంక్లిష్ట మిశ్రమాలే భారతీయుల కథగా, ఆ మాటకు వస్తే యావత్తు మానవాళి గాథగా అంతకంతకూ మనకు స్పష్టమవుతున్నది. రుగ్వేద సంస్కృతం మరో ఉదాహరణ. క్రీస్తుపూర్వం 1500 నాటికే తొలినాళ్ల ఇండో-ఆర్యన్ భాషలు పంజాబ్ ప్రాంతంలోని అంతరించిపోయిన ఆస్ట్రో-ఏషియాటిక్ భాషల నుంచి గణనీయ స్థాయిలో పదాలను సంతరించుకున్నాయని భాషా శాస్త్రవేత్త, వేదపండితుడైన ప్రొఫెసర్ మైకెల్ విట్జెల్ 'సబ్‌స్ట్రేట్ లాంగ్వేజెస్ ఇన్ ఓల్డ్ ఇండో-ఆర్యన్' అనే పుస్తకంలో (1999)లో రాశారు. అందులో ఊహాత్మకమైన సింధ్ ప్రాంతపు హరప్పా భాష 'మెలూహాన్', గంగా మైదానాల్లోని నవీన శిలాయుగపు రైతులు మాట్లాడిన 'లాంగ్వేజ్ ఎక్స్' అనే మరో భాష ఉన్నాయి. కొన్ని శతాబ్దాల తర్వాత క్రీస్తుపూర్వం 800 నాటికి వేదాల్లో ద్రవిడ పదాలు కనిపించడం మొదలైంది. ప్రస్తుతం అంతరించిపోయిన ఉత్తర ద్రవిడ భాషలు బహుశా అందుకు కారణం కావచ్చు. పైన వివరించినట్టుగా తమిళ సాహిత్యం, లిఖిత భాష క్రీస్తుపూర్వం 300 నుంచి మనకు కనిపిస్తున్నది. తొట్టతొలి తమిళ సాహిత్యం కవుల సమ్మేళనాల్లో రూపొందించిన 'సంగం' కవిత్వం రూపంలో లభిస్తున్నది. 'సంగం' అనే మాటే ఇండో-ఆర్యన్ భాషల నుంచి తీసుకున్నట్టు భాషా శాస్త్రవేత్తల ఏకాభిప్రాయంగా ఉంది. పాత తమిళ కవులకూ వైదిక మతాచారాలు తెలుసుననేదీ స్పష్టమే. ఈలోగా అదే సమయంలో ఉత్తరాదిలో ప్రాకృత సాహిత్యం వికాసం పొందింది. మతంలో, యజ్ఞయాగాదుల్లో సంస్కృతంపై అది పైచెయ్యి సాధించింది. బహుశా ప్రస్తుతం అంతరించిపోయిన ప్రాంతీయ ద్రవిడ భాషలు మాట్లాడేవారు ఉత్తరాది ప్రధాన స్రవంతిలో కలిసిపోవడం వల్ల ప్రాకృతం అభివృద్ధి చెందిందని భద్రిరాజు కృష్ణమూర్తి (ద్రవిడ భాషలు) అభిప్రాయం. ఇక క్రీస్తు శకం 600 నుంచి మొదలయ్యే మధ్యయుగాల్లో కన్నడ, తమిళం సహా దక్షిణాది ప్రధాన ద్రవిడ భాషలు అప్పటికే పునరుజ్జీవనం పొందిన ప్రాచీన భాష సంస్కృతం నుంచి రాజకీయ, వ్యాకరణ, మతపరమైన పదాలను అరువు తీసుకున్నాయి.

మైదుకూరులో 144 సెక్షన్ మరియు 30 యాక్ట్ అమలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు పోలీసుల ముఖ్య సూచనలు

నలుగురికి మించి గుమికూడరాదు.. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి పత్రికా ప్రకటన

మైదుకూరు మైదుకూరు పట్టణ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సూచనల మేరకు మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి పట్టణ ప్రజలకు పలు ముఖ్యమైన సూచనలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు సంయమనం పాటించాలని, పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. పట్టణ పరిధిలో అమలులో ఉన్న నిషేధాజ్ఞలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమతి లేని సమావేశాలు నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా నలుగురికి మించి ఒకచోట గుమికూడడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు: ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ ఇతర నిషేధాజ్ఞలు, పోలీసు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించే వారు సంబంధిత అధికారుల అనుమతులు, నిబంధనలు పాటించాలి. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం సంయమనం పాటించాలి. ప్రత్యర్థి పార్టీలపై దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, గొడవలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలి. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, నిరాధార ఆరోపణలు, రెచ్చగొట్టే పోస్టులు, ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయరాదు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడరాదు. పట్టణంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, గొడవలు జరిగే అవకాశం ఉన్నా, శాంతిభద్రతలకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటిస్తూ, ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలి. ఈ సందర్భంగా సీఐ హాజీవలి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేసినా, ఇతరులను రెచ్చగొట్టి గొడవలకు కారణమైనా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు చిరంజీవి, కత్తి వెంకటరమణ పాల్గొని ప్రజలకు ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలు, పోలీసు శాఖ సూచనలను వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని వారు సూచించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బెంగళూరు తొక్కిసలాట ఘటన.. గాయపడిన వారికి నోటీసులు జారీ

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మరణించగా మరో 47 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటనపై మెజిస్ట్రీరియల్ విచారణకు కర్ణాటక ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఘటనలో గాయపడిన 45 మందికి బెంగళూరు అర్బన్ జిల్లా డిప్యూటీ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. జూన్ 11న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. గాయపడిన వారు ఈనెల 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల మధ్య బెంగళూరులోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మెజిస్ట్రీరియల్ కోర్టు ఆడిటోరియానికి చేరుకొని తమ వాంగ్మూలాలను నమోదు చేసుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆర్‌సీబీ విజయోత్సవ వేడుక సందర్భంగా బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 47 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ విషాద ఘటనపై మెజిస్ట్రీరియల్ విచారణ జరుపుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొక్కిసలాటకు కారణాలేంటి? తలెత్తిన లోపాలు, జవాబుదారీతనం వంటి అంశాలను పరిశీలించేందుకు డిప్యూటీ కమిషనర్, బెంగళూరు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ 15 రోజుల్లోగా విచారణ చేస్తారని ప్రభుత్వం తెలిపింది.



సూది లేకుండానే రక్త పరీక్షలు.. ఏఐతో టెస్టులు.. వెంటనే రిపోర్టులు.. ఎక్కడో కాదు మన దగ్గరే..




భారతదేశంలో మొట్టమొదటి సరిగా సూది అవసరం లేకుండానే రక్త పరీక్ష చేసి ఒక్క నిమిషంలోనే రిపోర్ట్ ఇచ్చే ఏఐ బేస్డ్ దయాగ్నొస్టిగ్ టూల్ ను నిలోఫర్‌లో అందుబాటులోకి తెచ్చారు. నిలోఫర్ హాస్పిటల్, సుశేనా హెల్త్ ఫౌండేషన్ తో కలిసి క్విక్ వైటల్స్ దీన్ని అందుబాటులోకి తెచ్చింది. వైద్య శాస్త్రం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుంది. కంప్యూటర్‌ల నుండి మొబైల్ ఫోన్‌ల నుండి %జు, వీ=×% మెషీన్‌ల వరకు సాంకేతికత అభివృద్ధి, ఆధునిక అల్ట్రాసౌండ్, ల్యాబ్ పరీక్షలు చేయడంలో అద్భుతమైన కొత్త మార్గాలు శాస్త్రీయ ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయి.. ఈ క్రమంలోనే.. భారతదేశంలో మొట్టమొదటి సరిగా సూది అవసరం లేకుండానే రక్త పరీక్ష చేసి ఒక్క నిమిషంలోనే రిపోర్ట్ ఇచ్చే ఏఐ బేస్డ్ దయాగ్నొస్టిగ్ టూల్ ను నిలోఫర్‌లో అందుబాటులోకి తెచ్చారు. నిలోఫర్ హాస్పిటల్, సుశేనా హెల్త్ ఫౌండేషన్ తో కలిసి క్విక్ వైటల్స్ దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ఫోటోప్లెథిస్మోగ్రఫీ ద్వారా మొబైల్ లో ఫేస్ స్కానింగ్ ద్వారా 20 నుండి 30 సెకన్లలోనే టెస్టులు పూర్తవుతాయి. ఈ పరీక్ష విధానాన్ని మొదట నిలోఫర్ లోకి అందుబాటులోకి తెచ్చి నెక్స్ట్ మహారాష్ట్ర లో ప్రవేశపెడుతున్నాని సంస్థ నిర్వాహకులు తెలిపారు. నిలోఫర్ ఆసుపత్రిలో పిల్లలకు, గర్భిణులకు ఇలాంటి టెస్టుల ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిలోఫర్ వైద్యులు తెలిపారు. ఇది పిల్లలు, గర్భిణీ స్త్రీలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. భారతదేశంలో ఈ పరివర్తనాత్మక కార్యక్రమంను అందుబాటులోకి వచ్చింది. అమృత్ స్వస్త్ భారత్‌తో ఆరోగ్య పర్యవేక్షణ ఇక సెల్ఫీ తీసుకున్నంత సులభం. మొబైల్ ఫేస్ స్కానింగ్ టెక్నాలజీ కీలకమైన ఆరోగ్య సమాచారాన్ని వేగవంతమైన రీతిలో అందిస్తుంది. దీనితో రక్తపోటు, హార్ట్ రేట్, హీమోగ్లోబిన్ ఏ1సి వంటివి తెలుసుకోవచ్చు. ఈ పరీక్షలు 20 -60 సెకన్ల లోనే పూర్తవుతాయి. త్వరలోనే ఈ సేవలను దేశంలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నామని నిర్వాహకులు తెలిపారు.

తరచుగా బాత్రూంలోకి పరిగెడుతున్నారా..? వామ్మో.. ఆ డేంజర్ వ్యాధుల లక్షణం కావొచ్చు..



నేటి బిజీ జీవితంలో.. మనం తరచుగా మన శరీరం ఇచ్చే సంకేతాలను విస్మరిస్తాము. కానీ తీవ్రమైన వ్యాధులను సూచించే కొన్ని లక్షణాలు ఉన్నాయి. తరచుగా మూత్ర విసర్జన.. థైరాయిడ్ లక్షణాలు కూడా అలాంటి సంకేతాలే.. వీటిని తేలికగా తీసుకోవడం చాలా ప్రమాదకరం.. నేటి బిజీ జీవితంలో.. మనం తరచుగా మన శరీరం ఇచ్చే సంకేతాలను విస్మరిస్తాము. కానీ తీవ్రమైన వ్యాధులను సూచించే కొన్ని లక్షణాలు ఉన్నాయి. తరచుగా మూత్ర విసర్జన.. థైరాయిడ్ లక్షణాలు కూడా అలాంటి సంకేతాలే.. వీటిని తేలికగా తీసుకోవడం చాలా ప్రమాదకరం. మీరు తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి వచ్చినా.. అలాగే మీకు చాలా దాహం అనిపించినా.. ఇది యూరిన్ ఇన్ఫెక్షన్ కు సంబంధించిన సమస్య కావచ్చు. దీనికి అనేక కారణాలు, వ్యాధులు ఉండవచ్చు. రోజంతా తరచుగా మూత్ర విసర్జనకు ఏ వ్యాధులు కారణమవుతాయి.. వాటి ప్రధాన లక్షణాలు ఏమిటి..? వైద్య నిపుణులు ఏం చెబుతున్నారో ఈ కథనంలో తెలుసుకోండి.. తరచుగా మూత్ర విసర్జన పలు వ్యాధులను సూచిస్తుంది.. అవేంటో తెలుసుకోండి.. డయాబెటిస్.. మాక్స్ హాస్పిటల్ డాక్టర్ రోహిత్ కుమార్ మాట్లాడుతూ.. మీరు రోజంతా తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తే.. మీకు చాలా దాహం వేస్తే, అది డయాబెటిస్ సంకేతం కావచ్చు. డయాబెటిస్‌లో, శరీరం గ్లూకోజ్‌ను సరిగ్గా ప్రాసెస్ చేయలేకపోతుంది.. దీని కారణంగా మూత్రపిండాలు ఎక్కువ మూత్రాన్ని ఉత్పత్తి చేస్తాయి. మూత్ర మార్గ సంక్రమణ మహిళల్లో ఇది చాలా సాధారణం అని డాక్టర్ రోహిత్ వివరించారు. తరచుగా మూత్ర విసర్జన చేయడం, మూత్ర విసర్జన చేసేటప్పుడు మంట లేదా నొప్పి, దుర్వాసనతో కూడిన మూత్రం, ఇవన్నీ %ఖు×% లక్షణాలు కావచ్చు. దీనికి చికిత్స చేయకపోతే, అది మూత్రపిండాలకు చేరుకుంటుంది. ప్రోస్టేట్ సమస్యలు పురుషులలో, ప్రోస్టేట్ గ్రంథి విస్తరించడం వల్ల మూత్ర నాళంపై ఒత్తిడి పెరుగుతుంది, దీని వలన తరచుగా మూత్రవిసర్జన జరుగుతుంది, ముఖ్యంగా రాత్రి సమయంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. అతి చురుకైన మూత్రాశయం ఈ స్థితిలో, మూత్రాన్ని బిగ పట్టుకోవడం కష్టం అవుతుంది. మూత్ర విసర్జన చేయాలనే కోరిక కొద్దిగా వచ్చినా, వెంటనే టాయిలెట్‌కి వెళ్లాలి. ఇది నాడీ సంబంధిత కారణాల వల్ల కూడా కావచ్చు. మందులు తీసుకోవడం లేదా చాలా నీరు త్రాగడం.. మూత్రవిసర్జన (మూత్ర విసర్జనను పెంచే మందులు) వంటి కొన్ని మందులు కూడా తరచుగా మూత్రవిసర్జనకు కారణమవుతాయి. వేసవి కాలంలో ఎక్కువ నీరు త్రాగడం వల్ల కూడా ఈ ఫ్రీక్వెన్సీ పెరుగుతుంది. అయితే.. తరచుగా మూత్ర విసర్జన లక్షణాలను గమనిస్తే.. వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి వారు సూచించిన విధంగా చికిత్స పొందండి..

ఉల్లిపాయలు కోసేటప్పుడు కంటి నుంచి నీళ్లు రావద్దంటే ఏం చేయాలి? అద్భుతమైన చిట్కాలు!



సహజంగా ఉల్లిపాయలు కోసేటప్పుడు కళ్ల నుంచి నీళ్లు రావడానికి ప్రధాన కారణంగా అందులో ఉండే ఎంజైమ్‌లు. ఉల్లిపాయను కోసినప్పుడు దానిలో ఉన్న ఈ వాయువులలో ఒకటి బయటకు వస్తుంది. దీని నుంచి దీనిని సై ప్రొపనెథియల్ ఆక్సైడ్ అంటారు. ఉల్లిపాయలు కోసేటప్పుడు కంటి నుంచి నీళ్ల రావడంతో ఇబ్బందులుఉ పడుతుంటారు. మరి నీళ్లు రాకుండా, కంట్లో మంట రాకుండా ఉండాలంటే ఏం చేయాలో తెలుసా? ఈ అద్భుతమైన ట్రిక్స్ ఉపయోగిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

కన్నీళ్లు ఎందుకు వస్తాయి?

సహజంగా ఉల్లిపాయలు కోసేటప్పుడు కళ్ల నుంచి నీళ్లు రావడానికి ప్రధాన కారణంగా అందులో ఉండే ఎంజైమ్‌లు. ఉల్లిపాయను కోసినప్పుడు దానిలో ఉన్న ఈ వాయువులలో ఒకటి బయటకు వస్తుంది. దీని నుంచి దీనిని సై ప్రొపనెథియల్ ఆక్సైడ్ అంటారు. ఇది కంటి పొరను ఇబ్బంది పెడుతుంది. దీని వల్ల కళ్ళ నుండి కన్నీళ్లు రావడం ప్రారంభమవుతుంది. కొన్ని హోమ్ రెమిడీస్ పాటిస్తే కంటి నీళ్లను నివారించవచ్చంటున్నారు నిపుణులు.

గాగుల్స్ వాడకం:

ఉల్లిపాయలు కోసేటప్పుడు మీరు గాగుల్స్ ఉపయోగించవచ్చు. కళ్లకు గాలి తగలకుండా ఉండే ప్రత్యేక రకం గాగుల్స్ ఇది. ఈ విధంగా వాయువు మీ కళ్ళకు చేరదు. దీని వల్ల ఉల్లిపాయలు కోసేటప్పుడు కన్నీళ్ల రావు.ఉల్లిపాయలు కోసేటప్పుడు కంటి నుంచి నీళ్లు రావద్దంటే ఏం చేయాలి? అద్భుతమైన చిట్కాలు! సహజంగా ఉల్లిపాయలు కోసేటప్పుడు కళ్ల నుంచి నీళ్లు రావడానికి ప్రధాన కారణంగా అందులో ఉండే ఎంజైమ్‌లు. ఉల్లిపాయను కోసినప్పుడు దానిలో ఉన్న ఈ వాయువులలో ఒకటి బయటకు వస్తుంది. దీని నుంచి దీనిని సై ప్రొపనెథియల్ ఆక్సైడ్ అంటారు. ఇది..